క్లుప్తంగా

రేపు హనుమాన్ జయంతి ఉత్సవాలు

దొనకొండ: స్థానిక అడ్డ రోడ్డులోని పాపులమ్మ బావి వద్ద వెలసిన శ్రీప్రసన్నాంజనేయస్వామి హనుమాన్ జయంతి ఉత్సవాలు 22వ తేదీ గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ రాత్రి ఆలయం వద్ద ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి హనుమాన్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని, విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు బాలిరెడ్డి తెలిపారు.

సీపీఐ కార్యదర్శిగా రమేష్‌బాబు


సీపీఐ కార్యదర్శిగా ఎన్నికైన రమేష్‌బాబు

దర్శి (కురిచేడు): సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శిగా ఎం.రమేష్‌బాబు ఎన్నికయ్యారని జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ సోమవారం ప్రకటించారు. దర్శిలో జరిగిన 6వ మహాసభల్లో 25 మంది కౌన్సిల్ సభ్యులు, 11 మంది కార్యవర్గ సభ్యులతో కూడిన నియోజకవర్గ సమితి ఏర్పడిందని వివరించారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శులుగా ఆర్.కరుణానిధి, కోరేటి బాలయ్యలను ఎన్నిక చేసినట్లు తెలిపారు. రమేష్‌బాబు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తామని హెచ్చరించారు. నాయకులు కె.హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, గురుమూర్తి, సుంకర అంజిరెడ్డి, ఎస్. రామాంజి, అరుణమ్మ పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి


ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న అధికారులు

తాళ్లూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం టంగుటూరు ప్రకాశం పంతులు వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో దారా హనుమంతరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ధైర్యానికి, సాహసానికి, జాతీయ భావానికి ప్రకాశం పంతులు ముందు వరసలో ఉంటారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఏవో బి.ప్రసాద్‌రావు, పరిపాలనాధికారి ఎస్.సత్యం పాల్గొన్నారు.

శృంగేరి శారదాపీఠాధిపతికి ఘన స్వాగతం




దర్శి (కురిచేడు): శృంగేరి శారదాపీఠాధిపతి శ్రీవిదుశేఖర బారతీ మహాస్వామి మంగళవారం సాయంత్రం దర్శికి చేరడంతో ఆయనకు పూర్ణకుంభంతో వేదపండితుల వేదఘోషతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గడియార స్తంభం నుంచి ఉత్సవంగా పొట్టి శ్రీరాములు బజారు మీదుగా ఆర్యవైశ్య కళ్యాణ మండపం వరకు నిర్వహించారు. అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం, ఆశీర్వచనం జరిగింది. అనంతరం శ్రీశారదా చంద్రమేలేశ్వర అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర విజయవంతం చేయండి

మార్కాపురం టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం మార్కాపురం పట్టణంలో నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గోపాలుని హరిహరరావు, గుంటక వనజాక్షి, గుంటక సుబ్బారెడ్డి, పీవీకృష్ణారావు, ఇమ్మడిశెట్టి వీరారావు కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లుగా హనుమాన్ శోభాయాత్రను ప్రజలు, దాతలు, హిందూ బంధువుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. తర్లుపాడురోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి సాయంత్రం 4 గంటలకు వేలాది మంది భక్తులతో కలిసి కోర్టు సెంటర్, కంభం సెంటర్, పాత బస్టాండ్, దోర్నాల సెంటర్, నాయుడువీధి, మెయిన్ బజారు మీదుగా శోభాయాత్ర పాత బస్టాండ్‌కు చేరుతుందని, అనంతరం చెన్నకేశవ స్వామి గుడి వరకు కొనసాగుతుందని వివరించారు.

దిగజారిన బర్లీ పొగాకు ధరలు


తేమ శాతంతో ఇళ్లకు వచ్చిన పొగాకు బేళ్లు


పాకలో ఎండబెట్టిన బర్లీ పొగాకు

- ఇబ్బందులు పడుతున్న పొగాకు రైతులు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- లక్షలు ఖర్చు చేసి నష్టపోయిన రైతులు
- రుణాలు చెల్లించాలని బ్యాంక్‌ల ఒత్తిడి

దొనకొండ:

బర్లీ పొగాకు ధర రోజురోజుకు తగ్గిపోతోంది. గిట్టుబాటు ధర లేక అన్నదాతలు దిగాలు పడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల్లో అధిక పెట్టుబడులు పెట్టి బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గంగదేవిపల్లి, రుద్రసముద్రం, యర్రబాలెం, ఆరవల్లిపాడు, తెల్లబాడు, ఇండ్లచెరువు, సంగాపురం, వద్దిపాడు, వెంకటాపురం, పోలేపల్లి తదితర గ్రామాల్లో సుమారు 700 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. గతేడాది రూ.15 వేల నుంచి రూ.18 వేల ధర పలకటంతో ఈ ఏడాది అధికంగా సాగు చేశారు. రోజురోజుకూ ధర తగ్గి పోతోందని అన్నదాతలు చెప్తున్నారు. ప్రస్తుతం రూ.9 వేల నుంచి రూ.10 వేలకు పడిపోయింది. ఎకరాకు సుమారు ట్రాక్టర్, నారు, కూలీల ఖర్చులు రూ.70 వేల నుంచి రూ.80 వేల ఖర్చు వచ్చింది. పండించిన పొగాకు చెక్కులు కంపెనీలకు తీసుకెళ్తే ఐటీసీ, జీపీఐ, ఎలైన్ కంపెనీ నిర్వాహకులు తేమ శాతం ఎక్కువ ఉందని వెనక్కి పంపిస్తున్నారు. దీంతో రైతులు పొగాకు అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. పొలాలు, ఇళ్ల వద్ద ఆకును ఎండబెట్టుకుని బేళ్ల కట్టి చిలకలూరిపేట, మేదరమెట్ల, ఒంగోలు ప్రాంతాల్లోని కంపెనీలకు తీసుకెళ్తున్నారు. అక్కడ వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న బయ్యర్లు తేమ శాతం ఉంది, చెక్కులు వెనక్కి తీసుకెళ్లమని చెప్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతు 10 నుంచి 15 చెక్కులు తీసుకెళ్తే అందులో తేమ శాతం ఉందని రేటు పడక రైతులు ఇళ్లకు తీసుకొస్తున్నారు. ఖర్చులు ఎక్కువ పెరుగుతున్నాయి. దీంతో ఈ ఏడాది కష్టాలు తప్పేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొగాకు పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈ ఏడాది వ్యవసాయమే కలిసి రాలేదు:



ఈ ఏడాది వ్యవసాయం కలిసి రాలేదు. రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. నేను 5 ఎకరాల్లో పొగాకు నాటా. ఖర్చులు అధికంగా ఉండటంతో మిగిలింది ఏమీ లేదు. నాలుగేళ్ల అన్ని పంటలకు అనుకూలంగా ధర పలికింది. పొగాకు ధర కూడా రూ.15 వేల నుంచి 18 వేల వరకు అమ్ముకున్నాం. ఇప్పడు చేతిలో చిల్లిగవ్వ లేదు. వచ్చే ఏడాది పెట్టుబడికి కష్టంగా ఉంటుంది.

– చెన్నుబోయిన గురుమూర్తి, రైతు, రుద్రసముద్రం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారు. జీవనం సాగించాలన్నా చాలా కష్టంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ప్రజాప్రతినిధులు ఎన్నికల కోసం ఇళ్లకు వచ్చి మీ కష్టాలు తీరుస్తాం.. మాకు ఓటు వేయమంటూ ఓటర్లను మభ్యపెట్టి ఓటు వేయించుకున్నారేగానీ పట్టించుకునే నాయకుడే లేడు.

– చిరుపల్లి అంజయ్య, సీపీఎం కార్యదర్శి, దొనకొండ

ఈ ఏడాది నష్టాల్లో అన్నదాతలు:



ఈ ఏడాది రైతు పండించిన కంది, పత్తి, పొగాకు, మిరప పంటలకు పూర్తిగా ధర తగ్గిపోయింది. బ్యాంక్ అధికారులు మాత్రం రుణాలు కట్టమంటూ ఒత్తిడి చేస్తున్నారు. శుభకార్యాలు చేసుకుందామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. అప్పులు ఇచ్చే వాడే లేడు. రైతన్నకు ఏం చేయాలో అర్థంకాని రోజులు ఎదురయ్యాయి. వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడే రోజులు వచ్చాయి.

– బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివ్ సెక్రటరీ

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల


అలంకరణలో పోలేరమ్మ తల్లి

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో కులమతాలకు అతీతంగా పోలేరమ్మ తిరునాళ్లను ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తిరునాళ్లకు విచ్చేశారు. మరీ ముఖ్యంగా అమ్మవారికి మహిళలు నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా పోలేరమ్మ తిరునాళ్ల జరుపుకుంటున్నామని గ్రామ పెద్దలు చెప్తున్నారు. పోలేరమ్మ తల్లి చల్లగా చూడమ్మా.., పిల్లా పాపలు చల్లగా ఉండాలి.., పాడి పంటలు సమృద్ధిగా పండాలి, కుటుంబ జీవనాధారం బాగా సాగాలి తల్లి.. అని మొక్కుకున్నారు. అమ్మవారిని ట్రాక్టర్‌లో ఉంచి పురవీధుల్లో తప్పెట్లు, మేళతాళాలు, భజంత్రీలతో ఊరేగింపు చేశారు. యువకులు కేరింతలు కొడుతూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఆనందం పంచుకున్నారు. రాత్రి అందరూ ఐక్యంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ప్రభలు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరై అమ్మవారి దీవెనలు పొందనున్నట్లు గ్రామ నాయకులు తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


కోతకు గురైన రోడ్డు మార్జిన్

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లి సమీపంలో కొండ మూలమలుపు వద్ద తారురోడ్డు మార్జిన్ వర్షాలకు కోతకు గురైంది. కోతకు గురైన చోట అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత కోతకు గురవుతోంది. వాహనదారులు గమనించకుండా రోడ్డు దిగితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. పగటి పూట వాహనదారులు గమనించి వెళ్లినప్పటికీ రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. రాత్రి పూట మూలమలుపు వద్ద మార్జిన్ కనిపించక పోవడంతో ద్విచక్ర వాహనాలు కింద పడిన సంఘటనలు ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై తోకపల్లి, ఏనుగులదిన్నెపాడు, రాజంపల్లి, చట్లమిట్ల, ప్రగళ్లపాడు గ్రామాల ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

గ్రామాలకు వెళ్లే మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


ఆవులమందలో డేవిడ్ చిత్రపటాన్ని చూస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి


శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

కురిచేడు: మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, వారి కుటుంబాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని కాటంవారిపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న కాట్రెడ్డి ఆదిలక్ష్మమ్మ, నుసుం చిన్న వెంకటేశ్వరరెడ్డిలను పరామర్శించి వారి అనారోగ్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కురిచేడులోని బోయబజారులో ఇటీవల మృతి చెందిన ఉలవల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మండలంలోని వెంగాయపాలెంలో పార్టీ కార్యకర్త ఊట్ల పెద్ద వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆవులమంద పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన పల్లె డేవిడ్ ఇటీవల రోడ్ ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని హామీ ఇచ్చి ఆర్థిక సాయం చేశారు. ఆవులమంద కొత్తూరులో అనారోగ్యంతో బాధపడుతున్న మల్లెం గాలెయ్య, మోతుకూరి కాశమ్మలను పరామర్శించి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మండలంలోని బోధనంపాడు మాజీ సర్పంచ్ బత్తుల చిన్న సుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కార్యకర్త విద్యుత్ ప్రమాదంలో గాయపడటంతో ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి గోగుల మూడి లింగారెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు వి. కోటయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, కురిచేడు సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఎంపీటీసీ బి.వెంకట నర్సయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, మేరువ పిచ్చిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, నాయకులు ఎస్వీ నాగిరెడ్డి, గుంటక నాసరరెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, షేక్ మౌలాలీ, సారెడ్డి నాగిరెడ్డి, అంకె వెంకటేశ్వర్లు, మానం కోటయ్య, ఊట్ల శివ, గోపాలకృష్ణ, కాటం కోటిరెడ్డి, ముసికర యోగిరెడ్డి, కోలా సంతోష్‌కుమార్, రమణారెడ్డి, షేక్ మౌలాలీ, గొట్టిపాటి బాలకోటయ్య, రాములు, నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): మండలంలోని బండివెలిగండ్లలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కురంగి శ్రీకాంత్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. శ్రీకాంత్ కుమార్తె నాగజెశ్విత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో శ్రీకాంత్‌ను పరామర్శించారు. నాగ జెశ్విత మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

ఆయన వెంట దర్శి, కురిచేడు మండల పార్టీ కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, వైవీ సుబ్బయ్య, రాష్ట్ర మున్సిపల్ విభాగ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏఈ శ్రీనివాసరావు

తాళ్లూరు: ప్రభుత్వం 50 శాతం సబ్సిడీలో అందిస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తూర్పుగంగవరం 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లో పాడైపోయిన వస్తువులు మార్చాలన్నారు. వర్షాల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఏడీఈ రవికుమార్, ఏఈ పి.శ్రీనివాసరావు, జేఈ ఇమ్మానియేల్ బాబు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కృష్ణకు ఘన సన్మానం


ఉపాధ్యక్షుడు కృష్ణను సన్మానిస్తున్న టైలర్స్

త్రిపురాంతకం: మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాటిబండ్ల కృష్ణను టైలర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. త్రిపురాంతకం మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవిని వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. ఉపాధ్యక్ష పదవికి నూతనంగా కృష్ణ ఎన్నికైనందున మండల టైలర్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పలువురు ప్రముఖులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పచ్చిరొట్టకు వాతావరణం అనుకూలం

ముండ్లమూరు (కురిచేడు): పచ్చిరొట్ట విత్తుకునేందుకు ప్రస్తుతం ఉన్న వాతావరణం సరైందని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూఖ్ తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుక్కులు చేసుకొని పచ్చిరొట్ట ఎరువు పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలైన జనుములు, జీలుగలు 50 శాతం రాయితీతో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేస్తే నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెంచుతుందన్నారు. నేలలో సూక్ష్మజీవులు పెరిగి జీవరసాయనిక చర్యలు జరిగి నేల సారం పెరిగి ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుందన్నారు. జీలుగలు క్వింటా ధర రూ.5150, జనుములు క్వింటా ధర రూ.5450, రైతు వాటాగా చెల్లించాలని తెలిపారు. వీటి సాగుతో భూమిలోని సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని చెప్పారు. సేంద్రియ కర్బనం ఉన్న భూముల్లో రైతులు వాడే ఎరువుల్లోని పోషకాలు మొక్కలకు త్వరగా అందుతాయని తెలిపారు. రైతులందరూ ఈ సమయంలో పచ్చిరొట్ట పైర్లను ఎకరాకు జనుములు 16 కిలోలు, జీలుగలు 12 కిలోలు, పిల్లిపెసర 8 కిలోలు చల్లాలని తెలిపారు. పూత దశలో కలియదున్నితే భూసారం పెరుగుతుందని తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, సెల్‌ఫోన్ నంబరును రైతు సేవాకేంద్రాల వద్దకు తీసుకెళ్లి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా బంగారమ్మ, పోలేరమ్మ జాతర


పూజలందుకుంటున్న బంగారమ్మతల్లి


అలంకరణలో పోలేరమ్మతల్లి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు పంచాయతీ నాయుడుపేట గ్రామంలో మంగళవారం గ్రామ దేవతలైన బంగారమ్మ తల్లి, పోలేరమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. రామాలయం వద్ద బొడ్డురాయికి పూజలు చేసి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం రెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పోలేరమ్మతల్లి ఆలయం వద్ద గ్రామస్తులు, భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


పోలేరమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల సందడి

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు

- పంచాయతీ సిబ్బందిపై డీఎల్‌పీఓ ఆగ్రహం

అర్ధవీడు: మండలంలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను మార్కాపురం డీఎల్‌పీఓ ఎంవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. కాకర్లలో చెత్త నుంచి సంపద కేంద్రం అధ్వానంగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లోగా కేంద్రాన్ని బాగు చేసి ఫొటోలు పంపించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం పాపినేనిపల్లిలో కేంద్రాన్ని సందర్శించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎరువు దిబ్బలను తొలగించాలని ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.

క్షుద్రపూజలంటూ కలకలం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు గంగమొరస పొలాల్లో క్షుద్రపూజలు చేశారంటూ మంగళవారం కలకలం రేగింది. గ్రామానికి చెందిన అల్లు బాలంకిరెడ్డి పొలంలో పూరాతనమైన గంగమ్మ దేవత చిన్న గుడి ఉంది. గుడి ఎదురుగా పసుపు, కుంకుమ, నిమ్మకాయలు కోసి, గుందితో దీపారాధనలు చేసి పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. గుడి ఎదురుగా కొద్దిదూరంలో బీడు భూమిలో జేసీబీ సాయంతో దాదాపు 10 అడుగులు పొడవు, 20 అడుగుల వెడల్పు, 5 అడుగులు లోతు మట్టి తీసి మళ్లీ చదును చేసినట్లు కనిపిస్తోంది. ఈ తతంగం చేసేందుకు రెండు మోటార్ సైకిళ్లపై ఆరుగురు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పొలం యజమాని అన్న కుమారుడు అల్లు వెంకటరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి

పొదిలి: పొదిలి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా పి.సి.నారాయణరెడ్డి, కార్యదర్శిగా సీడీపీఓ సుధామారుతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సన్‌షైన్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎస్సీ బాలయ్య, కోశాధికారిగా వై.బాల వెంకటరెడ్డి, బీసీలుగా డి.వంశీకృష్ణ, యు.నరసారెడ్డి, బి.శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా ఎ.దివాకర్, టీవీ నాగరాజకుమారి, కె.శారా, జి.పుణ్యవతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎస్వీ సుబ్బారెడ్డి, బి.మస్తాన్ వ్యవహరించారు.